



140 250 మీటర్లా?

- అమరావతి ఓఆర్ఆర్ వెడల్పుపై స్పష్టత కరువు
- గతంలో 140 మీటర్లకే కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 250 మీటర్ల భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- గగ్గోలు పెడుతున్న రోడ్డు ఎలైన్‌మెంట్ బాధిత రైతులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) వెడల్పుపై స్పష్టత కొరవడింది. కొన్ని నెలల క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 140 మీటర్ల వెడల్పునకు తుది డీపీఆర్‌ని ఆమోదించింది. అయితే ఇప్పుడు ఆ వెడల్పు కూడా చాలదన్నట్లు బఫర్ జోన్ పేరుతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 250 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవకు నివేదించింది. జేసీ ఆమోదం తెలిపితే సర్వే నంబర్లతో భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు రెవెన్యూ యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే ఓఆర్ఆర్ కోసం పావు కిలోమీటర్ వెడల్పు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల ఎకరాలకు ఎకరాలు భూములు కోల్పోతామని గగ్గోలు పెడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 140 మీటర్లకే లోబడి భూసేకరణ చేసుకోవాలని కోరుతున్నారు. రాజధానికి మణిహారంగా ఉండేలా చేసేందుకు అవుటర్ రింగు రోడ్డుని ఏపీసీఆర్‌డీఏ ప్రతిపాదించింది. దాదాపుగా 190 కిలో మీటర్ల పొడవునా గుంటూరు, పల్నాడు, ఉమ్మడి కృష్ణ జిల్లాల మీదగా దీని ఎలైన్‌మెంట్‌ని రూపొందించారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.24,791 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ ఎగువన, దిగువన రెండు పొడవాటి బ్రిడ్జిలు, రిజర్వు ఫారెస్టులో టన్నెల్స్, రెండు స్పేర్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 ప్యాకేజీలుగా ఓఆర్ఆర్ పనులను విభజించి టెండర్లు పిలిచేందుకు నిర్ణయించారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతోనే రింగురోడ్డుని నిర్మించాలని భావించారు. అయితే భవిష్యత్‌లో రైలుమార్గం, ఇతరత్రా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో (మిగతా 6వ పేజీలో)

నేడే.. సుఖీభవ

అన్నదాతలకు ఆర్థిక సాయం

- 1,06,329 మందికి రూ.70 కోట్లు
- అర్హుల బ్యాంకు ఖాతాలకు రెండో విడత జమ




(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రైతులకు శుభవార్త. పీఎం-కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం-కిసాన్ పథకం కింద రూ.2,000 కలిపి మొత్తం రూ.7,000 అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల, నియోజక వర్గ స్థాయితో పాటు జిల్లా స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. సుఖీభవ సొమ్ము పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు సుఖీభవ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు వివరించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.7 వేల సాయం రబీలో పంటల సాగుకు ఉపయోగపడనున్నాయి. సుఖీభవ పథకం రెండో విడత డబ్బు తమ బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ (మిగతా 6వ పేజీలో)

జిల్లాలోని 1,06,329 మంది రైతులకు రెండో విడత రూ.70 కోట్లు విడుదల చేయనున్నది. జిల్లాలో పీఎం కిసాన్ కిం ద కేంద్రం రూ.16.84 కోట్లు ఇవ్వనుండ గా, అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.53.16 కోట్లు రైతులకు ఇవ్వనుంది. 2019 వరకు జరిగిన భూలావాదేవీలు ఆధారంగానే లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీ భవకు ప్రస్తుత సమాచారం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీంతో పీఎం కిసాన్ లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు మధ్య భారీ తేడా ఉంది.

నియోజకవర్గాల వారీగా సుఖీభవ అర్హుల ఇలా..

నియోజకవర్గం	అర్హుల సంఖ్య	పెట్టుబడి సాయం
ప్రత్తిపాడు	30428	20 (కోట్లలో)
పొన్నూరు	21632	13.93
తెనాలి	13381	8.79
మంగళగిరి	13483	8.97
తాడికొండ	27405	18.23



ఇదేం ప్రశ్నపత్రం

- చేతిరాతపై విద్యార్థుల అవాక్కు
- పునరావృతం కాదన్న పీజీ కోఆర్డినేటర్

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. అదేదో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు సంబంధించినవి కాదు. అలాంటి పరీక్షలకు సంబంధించి కూడా అధికారులు అప్రమత్తంగా ఉంటారు. అలాంటిది పీజీ కోర్సులకు సంబంధించి, అదీ విద్యార్థులకు కీలకమైన సెమిస్టర్ పరీక్షలంటే ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ఘనత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్య ధోరణి వీడటంలేదు. వర్సిటీ పరీక్షల విభాగం నిర్లక్ష్యం ఎంత అధ్వానంగా మారిందంటే సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా చేతిరాతతో ఇచ్చారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు చేతిరాతతో ఇచ్చిన ప్రశ్నపత్రం చూసి అవాక్కయ్యారు. వర్సిటీలో మంగళవారం పీజీ ఆర్ట్స్ సైన్స్, ఎంబీఏ, ఎంసీఏలతో పాటు ఎల్.ఎల్.బీ కోర్సులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే సైన్స్ విభాగం ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ప్రశ్నపత్రం చేతితో రాసినది చూసి విద్యార్థులు విస్తుపోయారు. చివరకు విద్యార్థులకు నచ్చచెప్పిన అధ్యాపకులు వారితో పరీక్ష రాయించారు. ఆ ప్రశ్నపత్రాన్ని చూసి అధ్యాపకులు కూడా కంగుతున్నారు. ఈ ప్రశ్నపత్రంపై ఆరా తీయగా గతంలో ప్రశ్నపత్రాల లీకేజ్‌కి సంబంధించిన అధ్యాపకుడే కారణమని తెలిసింది. దీనితో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. దీనిపై పీజీ కోఆర్డినేటర్ సుబ్బారావును వివరణ కోరగా సమయం తక్కువ ఉండటంతో రాత పూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.



మావోల షెల్టర్‌పై.. ఉలికిపాటు

- కలకలం రేపిన విజయవాడ ఘటన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులపై పోలీసుల ఆరా
- నాడు మావోలకు పెట్టనికోటగా పల్నాడు, నల్లమల ప్రాంతం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని తోపాటు రాష్ట్రంలోనే అత్యంత కీలక ప్రాంతం విజయవాడలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్న ఉదంతం పోలీస్ శాఖతో ప్రజలను కూడా ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడలో ఏకంగా 32 మంది మావోయిస్టులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. గతంలో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలోనూ విజయవాడ లాంటి నగరంలో ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఛత్తీస్‌ఘడ్, ఏవోబీ ప్రాంతాల్లో కేంద్ర పోలీస్ బలగాల ముప్పేట దాడులతో ఇప్పటికే మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వందలాది మంది ఎన్‌కౌంటర్లలో హతమవగా, అదే స్థాయిలో లొంగుబాటు పర్వం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా మావోయిస్టుల అత్యంత కీలక నేత హిడ్మా సహా ఆరుగురు ఎన్‌కౌంటర్లో మృతి చెందడం... అదే సమయంలో విజయవాడలో 32 మంది పోలీసులకు పట్టుబడటం కలకలం రేపింది. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది.

గతంలో నల్లమల కీలకమైన ప్రాంతం

ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా... షెల్టర్ జోన్‌గా ఉన్న నల్లమల ప్రాంతంలో దాదాపు ఒకటిన్నర దశాబ్దంగా వారి ఉనికే లేకుండా పోయింది. గతంలో నల్లమల కేంద్రంగా మావోయిస్టులు కార్యకలాపాలు సాగించారు. నల్లమలను ఆసరాగ పల్నాడు ప్రాంతంలో పూర్తిస్థాయిలో విస్తరించి పోలీస్ శాఖకు సవాల్‌గా నిలిచారు. దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే పల్నాడు ప్రాంతవాసి కావడంతో ఈ ప్రాంతంపై మావోయిస్టులు తమదైన శైలిలో ముద్రవేశారు. అటు తెలంగాణ సరిహద్దు జిల్లాలతో పాటు ఇటు ఏపీలోని సరిహద్దు జిల్లాల మధ్య విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతం గతంలో మావోయిస్టులకు షెల్టర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ నుంచే మావోయిస్టులు పెద్దఎత్తున కార్యకలాపాలు సాగించారు. 2004లో ప్రభుత్వంతో మావోయిస్టు చర్చలు విఫలం తర్వాత మావోయిస్టుల అనుపానులు తెలుసుకుని నల్లమలలో వారి షెల్టర్‌కు గండి కొట్టారు. దీంతో వారంతా ఈ ప్రాంతాన్ని వదిలి ఏవోబీ వైపు వెళ్లారు. 2010 నుంచే పల్నాడు ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కనుమరుగవుతూ వచ్చాయి. అదే సమయంలో తెలంగాణలో కూడా పూర్తిగా మావోయిస్టు కార్యకలాపాలను అణిచి వేయడంతో ఏపీ, తెలంగాణలో మావోయిస్టులకు షెల్టర్ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తాజాగా విజయవాడలో 32 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులు చర్చనీయాంశమయ్యాయి. అయితే విజయవాడలో మావోయిస్టులు పట్టుబడిన సందర్భాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్, ఏఓబీ ప్రాంతంలో పోలీస్ దాడులు పెరగడంతో ప్రాణరక్షణ కోసం మావోయిస్టులు మైదాన ప్రాంతం వైపు వచ్చి ఉంటారని... పరిస్థితులు అనుకూలిస్తే లొంగిపోవాలని భావించి ఉంటారని పోలీసు వర్గాలు అంటున్నాయి. నల్లమల ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని.. అలాగే పల్నాడు ప్రాంతంలో వారికి షెల్టర్ అవకాశమే లేదని నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రహస్యంగా ఈ ప్రాంతానికి వచ్చినా ప్రజలే పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించే పరిస్థితులు ఉన్నాయంటున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఐజీ రవికష్ణ, ఎస్పీ వకుల్‌జిందాల్, వీఐటీ ప్రతినిధులు

మాదక ద్రవ్య రహితంగా 'సంకల్పం'

- భావి తరాలను కాపాడుకోవాలన్న ఐజీ రవికష్ణ
- డ్రగ్స్ కేసులో పట్టుబడితే 20 ఏళ్లు జైలుశిక్ష : ఎస్పీ జిందాల్

ఐనవోలు(తుళ్లూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాను మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే 'సంకల్పం' ఉద్దేశమని ఈగల్ ఐజీ రవికష్ణ తెలిపారు. రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం ఐనవోలులోని ఏపీ వీఐటీ యూనివర్సిటీలో మంగళవారం 'సంకల్పం - మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం' అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. డ్రగ్స్ టెర్రరిస్టులకు ఆర్థికపరమైన వనరుగా ఉన్నాయన్నారు. ఆపరేషన్ చైతన్యం అనే కార్యక్రమాన్ని చేపట్టి అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగును నిర్మూలించామన్నారు. పొగాకు రహిత విద్యా సంస్థలు అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ అనేక రకాలుగా విస్తరిస్తున్న మాదకద్రవ్యాలకు ఎక్కువగా విద్యార్థులు ప్రభావితం అవుతున్నారని, అదీ స్నేహితుల ద్వారానే అన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కి అలవాటు పడితే అవి వారి జీవితాల్ని నాశనం చేస్తాయన్నారు. మాదక ద్రవ్యాల కేసులో పట్టుబడితే సుమారు 20 సంవత్సరాల జైలుశిక్ష పడుతుందన్నారు. హత్య కేసు కంటే డ్రగ్స్ కేసు ఎంతో తీవ్రమైనదన్నారు. వర్సిటీలో ఇప్పటికే ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశామని డ్రాప్‌బాక్స్ అనే ఒక ఫెసిలిటీ కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు. కళాశాలలో ఎక్కడైనా మాదకద్రవ్యాల జాడలు ఉంటే ఆ సమాచారాన్ని రాసి డ్రాప్ బాక్స్‌లో వేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్‌కు లోనయ్యే విధానాల గురించి విద్యార్థులు రూపొందించిన నాటికలు, వీడియోలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ హనుమంత్, వర్సిటీ వైస్ చాన్సలర్ డా.శ్రీఆరుల్‌మౌళివర్మన్, రిజిస్ట్రార్ డా.శ్రీజగదీష్‌చంద్ర పాల్గొన్నారు.

ఆధార్ లేని పిల్లలు 16 వేల మంది

- రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలి
- సీడీపీఓలకు జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆదేశం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో సుమారు 16 వేల మంది పిల్లలకు ఆధార్ కార్డులు లేవని జడ్పీ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. వారిలో 7502 మందికి జనన ధ్రువీకరణ పత్రం ఉందని, 8961 మంది పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం కూడా లేదన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాల యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖకు చెందిన సీడీపీఓలతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నందున క్షేత్రస్థాయిలో ఆధార్‌లేని పిల్లలను అక్కడకు తరలిం చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనన ధ్రువీకరణపత్రం ఉన్న వారికి వెంటనే ఆధార్ తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరికైతే జన న ధ్రువీకరణ పత్రం ఉండదో వారు సచివాలయ సెక్రటరి ద్వారా రెవెన్యూ అధికారులను సంప్రదించి పొందాలన్నారు. సీడీపీఓలు ఆధార్ నమో దుపై ప్రత్యేకంగా దృష్టి సారించి పిల్లలందరికీ ఆధార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపీడీ ప్రసూనా పాల్గొన్నారు.



వెంకటపాలెం టీటీడీ దేవస్థానానికి నిధులు

- రూ. 90 కోట్లు కేటాయించిన పాలక మండలి
- ఈ నెల 27న సీఎం పనులను ప్రారంభించే అవకాశం

6

మూడు రోజులే గడువు

- రూ.29 కోట్లు నీటి పన్ను పెండింగ్
- చెల్లించకుంటే కుళాయి కనెక్షన్లు కట్: కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నీటి పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. ఈ క్రమంలో వాటి వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. నీటి పన్నుల చెల్లింపునకు మూడు గడువు విధించారు. ఆలోగా చెల్లించకుంటే కుళాయి కనెక్షన్లు కట్ చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళశారం హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే నగర పాలక సంస్థకు నీటి పన్నులు రూ.29 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో కమర్షియల్ సంస్థలు, అపార్ట్మెంట్ వాసులు మూడు రోజుల్లోగా బకాయిలు చెల్లించకుంటే వారి ట్యాప్ కనెక్షన్లు తొలగిస్తామని తెలిపారు. కమర్షియల్ సంస్థలు, అపార్ట్మెంట్ వాసులు నిర్దేశిత మీటర్ చార్జీలు చెల్లించడంలేదన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా సచివాలయ కార్యదర్శుల ద్వారా పలుమార్లు బకాయిలు చెల్లించాలని యజమానులకు తెలియచేసినా స్పందిం చలేదన్నారు. ఈ పరిస్థితుల్లో చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు.

సర్వే లక్ష్యాలను అధిగమించాలి

క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలి • కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశాలు జారీ



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేలకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సచివాలయ ఉద్యోగులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. ఉపాధి హామీ, గృహనిర్మాణ, గ్రామ,వార్డు సచివాలయాల సేవలు, రెవెన్యూ అంశాలపై ప్రత్యేక అధికారులు, రెవెన్యూ డివిజన్, మున్సిపల్ కమిషనర్లు మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా సర్వేలలో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేలో జరిగిన మ్యూటేషన్లను సబ్‌కలెక్టర్, ఆర్డీవో పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. సరిహద్దు వివాదాలు, విస్తీర్ణం తేడాలపై అధికారులు జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్లను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు జాబ్ కార్డులు, ఈకేవైసీకి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని తెలిపారు. వెంగళాయపాలెం చెరువు తరహా అభివృద్ధికి ఇతర గ్రామాల్లో చెరువులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. పీఎంఏవై గ్రామీణ్‌కు డిమాండ్ సర్వేను వేగవంతం చేయడానికి సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవోలు సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు.

వీరులను స్మరించుకుంటూ..

- నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం

6

ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయండి

- క్యాటరాక్ట్ ఆపరేషన్లకు రూ.16.49 కోట్లు పెండింగ్
- కలెక్టర్‌కు శంకర ఆస్పత్రి యాజమాన్యం వినతిపత్రం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): కంటి శుక్లాలకు సంబంధించి క్యాటరాక్ట్ ఆప రేషన్స్‌కు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయించాలని శంకర కంటి ఆస్పత్రి యాజమాన్యం మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ని కలిసి వినతిపత్రం అందజేసింది. గత ఐదేళ్ల నుంచి బకాయిలు పేరుకుపోయాయన్నారు. గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, ఎన్‌టీఆర్, ఏలూరు, కృష్ణ జిల్లాల కు సంబంధించి శస్త్ర చికిత్సల బిల్లుల చెల్లింపు జరగడం లేదన్నారు. 82,478 మం దికి నిర్వహించిన శస్త్రచికిత్సల తాలూక రూ.16 కోట్ల 49 లక్షల 56 వేలు బకాయి లు విడుదల కావాల్సి ఉందన్నారు.



ప్రసంగిస్తున్న వింగ్ కమాండర్ యాకుబ్ అలీ

దేశసేవకు అగ్నిపథ్‌తో అవకాశం

- వింగ్ కమాండర్ యాకుబ్ అలీ

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశసేవకు అద్భుత అవకాశం అగ్నిపథ్‌తో పొందవచ్చని 12వ ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ అధికారి, వింగ్ కమాండర్ షేక్ యాకుబ్‌అలీ తెలిపారు. వైమానిక దళంలో అవకాశాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సికింద్రాబాద్ 12 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైమానిక దళంలో వివిధ ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవ కోసం యువత వైమానిక దళంలో చేరాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డీ దుర్గాబాయి మాట్లాడుతూ అగ్నిపథ్ యువత ధైర్య సాహసాలకు, మేథోమదనం, నైపుణ్యానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. పది, ఇంటర్ విద్యార్హతతో అగ్నిపథ్ ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఎయిర్ ఫోర్స్ నర్సింగ్ రంగంలోనూ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. శరీర ధారుడ్య, రాత పరీక్షలను ప్రణాళికా బద్ధంగా చేపట్టడం వల్ల విజయం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుక, జిల్లా సైనిక సంక్షేమ అధికారి గుణశీల తదితరులు పాల్గొన్నారు.

3 పీహెచ్‌సీలు.. రూ.5.79 కోట్లు

పెదనందిపాడు, దుగ్గిరాల, మందడంలో నిర్మాణం

గుంటూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.79 కోట్లు మంజూరు చేసింది. పెదనందిపాడు, దుగ్గిరాల, మంద డం పీహెచ్‌సీ నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఒక్కో పీహెచ్‌సీ నిర్మాణం కోసం రూ.1.93 కోట్లు కేటాయించింది.

రవీంద్రబాబుకు పీహెచ్‌డీ ప్రదానం



ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన యండ్రపాటి రవీంద్రబాబుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. డాక్టర్ ఓ.నాగరాజు పర్యవేక్షణలో అడాప్టివ్ రీసోర్స్ మేనేజ్మెంట్, వర్క్ ఫ్లో ఆప్టిమైజేషన్ ఇన్ బిగ్ డేటా సిస్టమ్స్, యూజింగ్ ఇంటిగ్రేటెడ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై రవీంద్రబాబు పరిశోధనా గ్రంథాన్ని సమర్పించి పీహెచ్‌డీని పొందారు. పీహెచ్‌డీ పట్టాను పొందిన రవీంద్రబాబును అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఏఎన్‌యూ పరిధిలో పరీక్షలు ప్రారంభం




పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి ఎంఈడీ, బీఈడీ మూడో సెమిస్టర్, పీజీ సైన్స్, ఆర్ట్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు నాగార్జున యూనివర్సిటీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 5,800 మంది విద్యార్థులు, ఎం ఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలకు 150మంది, లా పరీక్షకు 700 మంది, స్పెషల్ బీఈడీ పరీక్షకు 30 మంది, పీజీఆర్ట్సుఅండ్ సైన్స్ పరీక్షకు 3,675 విద్యార్థులు హాజరయ్యారు.

వెంకటపాలెం టీటీడీ దేవస్థానానికి నిధులు

● రూ. 90 కోట్లు కేటాయించిన టీటీడీ పాలక మండలి ● ఈ నెల 27న సీఎం పనులను ప్రారంభించే అవకాశం



నిర్మించనున్న దేవస్థానం వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నమూనా ప్లాన్

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర వైభవాన్ని అమరావతిలోనే దర్శింపజేసేలా రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఆలయం చుట్టూ భారీ ప్రాకారం, ప్రధాన ముఖద్వారం వద్ద ఏడు అంతస్తులతో మహారాజ గోపురం, మూడు దిక్కుల్లో ఐదు అంతస్తులతో రాజ గోపురాలు, మాడ వీధులు, కల్యాణోత్సవ, కల్యాణ మండపాల నిర్మాణ పనులను ప్రారంభించబోతోంది. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 90 కోట్లు నిధులు కేటాయించడంతో మరో వారం పది రోజుల్లో నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే నిర్మాణాల పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

● రూ. 185 కోట్లతో ప్రణాళిక

శ్రీవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 185 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేసింది. వాటిని ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీటీడీ అధికారులు వివరించారు. ఆయన ఆమోదముద్ర వేయడంతో అమలుకు పూనుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం రూ.90 కోట్ల నిధులను టీటీడీ విడుదల చేసింది. ఆ నిధులతో ఈ నెల 27న పనులు ప్రారంభించనున్నారు.

● జగన్ కక్షతో నాడు ఆగిన నిర్మాణం

రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని ఏడున్నరేళ్లకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. వెంకటపాలెం వద్ద సీడ్ యాక్సిస్ రోడ్డు, కృష్ణా కరకట్టకు మధ్యలో 25 ఎకరాలను అందుకోసం కేటాయించింది. రూ. 136 కోట్ల అంచనా వ్యయంతో తిరుమలను తలపించేలా శ్రీవారి ఆలయం నిర్మించాలని భావించింది. ఈ ప్రతిపాదనకు తితిదే ధర్మకర్తల మండలి 2018లో ఆమోదం తెలిపింది. ప్రణాళికలు సిద్ధమై పనులు ప్రారంభించిన కొన్నాళ్లకే వైసీపీ అధికారంలోకి వచ్చింది. రాజధానిపై కక్షగట్టి ఎక్కడి పనులు అక్కడే నిలిపేసింది. ఆలయ నిర్మాణానికి కేటాయించిన అంచనాలను రూ. 136 కోట్ల నుంచి 36 కోట్లకు కుదించి, రూ.100 కోట్లను విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో శ్రీవారి ఆలయ నిర్మాణ పనులూ నిలిచిపోయాయి. ప్రధాన ఆలయం, లోపాలి ప్రాకారం, ఒక రాజగోపురం, ధ్వజస్తంభ మండపాలు మాత్రం నిర్మించి మమ అనిపించారు.

● అన్ని హంగులతో దేవస్థాన నిర్మాణం

ఏడున్నరేళ్ల క్రితం శ్రీవారి ఆలయాన్ని ఏ స్థాయిలో నిర్మించాలనుకున్నారో దానికి మించి సకల హంగులతో దేవస్థానాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఇప్పుడు వెలుపలి ప్రాకారాన్నీ నిర్మించనున్నారు. వెలుపలి ప్రాకారానికి తూర్పు దిక్కున ప్రధాన ముఖద్వారం వద్ద 7 అంతస్తులతో మహారాజ గోపురం, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశల్లో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మిస్తారు. వాటితో పాటు కల్యాణోత్సవ, ఉత్సవ మండపాలను నిర్మించనున్నారు. ప్రస్తుతం తొలి దశ పనుల్లో భాగంగా వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నిర్మాణాలను చేపట్టనున్నారు.

వీరులను స్మరించుకుంటూ...

● నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం



వీర్ల దేవాలయం

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదవీ వ్యామోహం.. దాయాదుల వైరం.. శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో కారంపూడి వేదికగా జరిగిన పల్నాటి యుద్ధానికి ఓ చరిత్ర ఉంది. గతంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎందరో రాజులు గతించారు. ఎన్నో రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాని కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధం మాత్రం నేటికీ ప్రజల హృదయాంతరాలలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ద్వాపర కాలంనాటి మహాభారతాన్ని తలపిస్తూ సాగిన మారణకాండలో ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండె చప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను అలపిస్తాయి. సుమారు 900 సంవత్సరాలకు పూర్వం నాయకురాలు నాగమ్మకు, బ్రహ్మనాయుడు వర్గాలకు మధ్య జరిగిన భీకర పోరాటం గుర్తులు నేటికీ చెరిగిపోలేదు. నాటి రాజులు వాడిన ఆయుధాలు, వారి గుర్తుగా శిలలు కారంపూడిలోని వీర్లదేవాలయంలో పల్నాటి చరిత్రకు సజీవసాక్ష్యాలుగా నిలిచాయి. ప్రపంచంలోని రోమ్ నగరం తరువాత మన దేశంలోని కారంపూడిలో మాత్రమే వీరులకు ఉత్సవాలు జరపడం విశేషం

వీరారాధన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23వ తేదీన కల్లిపాడుతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే పలు జిల్లాల నుంచి వీరాచారవంతులు కారంపూడికి చేరుకున్నారు. తమ పూర్వీకుల ఆయుధాలకు గంగధారమడుగులో స్నానమాచరింపజేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యావారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్, కూటమి నేతలు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

● ముస్తాబైన ఆలయాలు

వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారి ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మనాయుడి మేడ, కన్నమదాసు మేడ, వీరుల దేవాలయాలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

140 మీటర్లా.. 250 మీటర్లా?

(5వ పేజీ తరువాయి)

చర్చించి 140 మీటర్ల వెడల్పునకు ఆమోదం పొందారు. కాగా ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఏకంగా 250 మీటర్ల వెడల్పుతో తుది డీపీఆర్‌ని సిద్ధం చేసి కేంద్రం నుంచి ఆమోదం తీసుకుని గుంటూరు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి నివేదించారు. దీని వల్ల భూసేకరణ ఖర్చులు పెరిగిపోతాయి. పైగా భూమినే నమ్ముకుని తరతరాలుగా జీవిస్తోన్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అలానే పరిశ్రమలు, వాటర్ బాడీస్‌కి కూడా నష్టం జరగొచ్చు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌పై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. 140 మీటర్ల వెడల్పులోనే మీడియన్‌తో ఆరు వరుసల రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లు, రైలుమార్గానికి సరిపోతుంది. అలాంటిది దీని కంటే 110 మీటర్లు అదనంగా భూసేకరణ చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రెవెన్యూ అధికా రులు తమతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరుతున్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

దిగువకు 725 క్యూసెక్కుల నీటి విడుదల



దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను తగ్గించడంతో ప్రకాశం బ్యారే జీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 9,618 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 725 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,154 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

నేడే.. సుఖీభవ

(5వ పేజీ తరువాయి)

చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న గందరగోళం

లబ్ధిదారుల సంఖ్యలో తొలి దశలో ఉన్న గందరగోళమే ఇప్పటికీ కొనసాగుతోంది. అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు మధ్య భారీ సంఖ్యలో వ్యత్యాసం ఉంది. వెబ్‌ల్యాండ్ వంటి సాంకేతిక చిక్కులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పీఎం కిసాన్ లబ్ధిదారుల ఎం పిక జరిగిందని గతంలో యంత్రాంగం చెప్పింది. 2019 నుంచి ఉన్న వెబ్ ల్యాండ్ డేటానే కేంద్రం ప్రామాణికంగా తీసుకుంటుందని, అందువల్లే లబ్ధిదా రుల సంఖ్యలో తేడా ఉందని అధికారులు చెప్పారు. రెండో దశ నిధులు విడుదల నాటికీ ఈ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో తెలిపారు. కానీ తొలి దశలోని లబ్ధిదారుల సంఖ్యనే ఇప్పుడు కూడా వ్యవసాయశాఖ చూపిస్తోంది. తొలి దశ రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాక, అర్హత కలిగిన ఎవరికైనా సుఖీభవ నిధులు పడకపోతే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దాని ఆధారంగా పలువురు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వారి అర్హతను నిర్ధారించారు. అయితే తాజా లబ్ధిదారుల్లో వారి పేర్లు కనిపించడంలేదు. అభ్యంతరాల ద్వారా అప్పుడు అర్హులుగా తేలిన వారు, మలి విడతలో ఎందుకు అనర్హులయ్యారనేదానికి వ్యవసాయశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కౌలు రైతుల జాబితాలు ఇంకా సిద్ధం కానట్లు తెలుస్తోంది. కౌలు రైతులకు ఒకేసారి రూ.14 వేలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రెండో విడతలో కౌలు రైలుకు సుఖీభవ అందుతుందా లేదా అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ సారి లేకుంటే మూడో విడతలో వారికి సుఖీభవ అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గొంతునులిమి భార్యను చంపిన భర్త



లక్ష్మీపార్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో మంగళ వారం కట్టుకున్న భార్యను ఆమె భర్త గొంతు నులిమి హత్య చేశాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కిలిమి శంకర్‌రెడ్డి, లక్ష్మీపార్వతి (29)కు ఐదేళ్ల కిందట వివాహ మైంది. వారి దాంపత్య జీవితంలో కలహాలు రావడంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటు న్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపార్వతి మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేస్తూ ఎర్రబాలెం గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం భర్త శంకర్‌రెడ్డి లక్ష్మీపార్వతి నివా సానికి వచ్చి దాడి చేయడంతో బాధితురాలు కేకలు పెడుతూ పక్కింట్లోకి పారిపోయింది. శంకర్‌రెడ్డి ఆమె వెంటపడి లో పల నుంచి తలుపు గడియ పెట్టి గొంతు నులిమి హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ బ్రహ్మం, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పరిశీ లించి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు పరారీలో ఉండగా, రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెింటి కోసం వచ్చి..బంగారంతో ఉడాయింపు

తెనాలి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అద్దె ఇంటి కోసమని వచ్చి ఇంటి యజమానురాలిని మాటల్లోకి దించి అగంతకుడు బంగారు నగలతో ఉడాయించిన సంఘటన తెనాలి పాండురంగ పేటలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, పాండురంగపేటకు చెందిన కామినేని పద్మ తమ ఇంటిలో ఒక పోర్షన్‌ను అద్దెకు ఇవ్వడానికి టూలెట్ బోర్డు పెట్టారు. అద్దె పోర్షన్ చూడటానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమెను మాటల్లో పెట్టి ఇంటిలో మంచం పక్కన ఉంచిన 60 గ్రాముల బంగారు నానుతాడు, నల్లపూసల గొలుసు అపహరించి పరారయ్యాడు. కొంత సమయం తరువాత గొలుసులు మెడలో వేసుకోవడానికి వెతకగా అవి కనిపించలేదు. దీంతో కామినేని పద్మ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎన్‌యూ ఫార్మసీలో క్రికెట్ పోటీలు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ (ఏఎన్‌యూ) ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తేజో మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజో మూర్తి మాట్లాడుతూ, బుధవారం ఫార్మసీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అధికారులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్. మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, పావని పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

47,667 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,885 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,667 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,907 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	14000
334	10000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	16000	334	10500	17500
273	----	----	నెంబరు. 5	10000	16500
341	10000	17500	341	10500	18000
4884	----	----	4884	11000	14600
సూపర్ 10	----	----	సూపర్ 10	10500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18200	దేవనూరు డీలక్స్	10500	17500
దేవనూరు డీలక్స్	10500	17000	తాలుకాయలు	5000	9000

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల వరద

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల వరదలు మొదలయ్యాయని విశాఖలో నిర్వహించిన సీఐఐ సమ్మిట్ ద్వారా సీఎం చంద్రబాబు నిరూపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని టీడీ పీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాం లో ఎంతోమంది పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం నుంచి వెళ్ళిపోయారని అన్నారు. విశాఖ సమ్మిట్లో 13.86 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయని, అమరావతి ప్రాంతానికి క్వాంటమ్ వ్యాలీ తెస్తున్నా రని అన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడు తూ రాష్ట్రానికి తెచ్చిన 13 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 16 లక్షల ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ జరిగిందన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న సంస్కరణలతో హైదరాబాద్ డెవలప్ అయిందని, కానీ గత ప్రభుత్వం రాష్ట్రం నుంచి పరిశ్రమలను పారిపోయేలా చేసిందని విమర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా పని చేస్తోందన్నారు. హెల్దీ, హ్యాపీ స్టేట్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న ఏపీకి పరిశ్రమల పెట్టుబడులు అనేవి ఒక దిక్కుగా ఉంటాయన్నారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ అభి వృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంద న్నారు. సమావేశంలో దాసరి రాజా మాస్టారు, కంచర్ల శివరామయ్య, గోళ్ళ ప్రభాకర్, కల్లూరి శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, అన్నాబత్తుని జయ లక్ష్మి, తిరువళ్ళూరి పద్మావతి, గింజుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఈమామ్‌లు, మౌజన్లతో సమావేశమైన ఎమ్మెల్యే నసీర్

సౌదీ మృతుల కుటుంబాలకు అండగా నిలుద్దాం

● మౌజన్లు, ఇమామ్‌లతో ఎమ్మెల్యే నసీర్ సమావేశం

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తర పున అండగా నిలిచేందుకు తాను సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సౌదీ ఘటన మృతు లకు సంతాపం నిమిత్తం ఆయన మంగళవారం తన కార్యాలయంలో ఇమామ్‌లు, మౌజన్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర యాత్రకు వెళ్లిన వారు అర్థంతరంగా తనువు చాలించటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాల వేదనను ఎవరు తీర్చలేనిదని, వారికి ఆ భగవంతుడు తోడుగా నిలవాలని ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని ఇమామ్‌లు, మౌజన్లకు సూచించారు. గుంటూరు నుంచి మక్కా యాత్రకు వెళ్లిన ముస్లింలు క్షేమంగా ఉన్నారన్నారు. అనంతరం ఈ ఏడాదికి మౌజన్లు, ఇమామ్‌ల గౌరవ వేతనం రూ.90 కోట్లు అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం మహిళల ఆర్థిక స్వావలంబనకు విరివిగా సబ్సిడీపై రుణాలందిస్తున్నామని తెలిపారు. ఉపాధి శిక్షణతోపాటు స్కిల్ కమ్యూనికేషన్స్ ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య భరోసా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల సంజీవని అని, కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యానికి భద్రత అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.19 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, పోతురాజు చంద్రశేఖర్, మహంకాళి నరసింహారావు, గోళ్ల ప్రభాకర్, అబ్దుల్ సలీం, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ బోర్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీ, ఏటీ అగ్రహారం, శ్యామల నగర్, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలో జరిగే పనులను నిర్దేశిత గడువు మేరకు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే ప్రధాన రోడ్ల వెంట విద్యుత్ స్తంభాలకు వివిధ రకాల కేబుల్స్ వేలాడుతూ ప్రజల, వాహనాల రాకపోకల సమయంలో అడ్డుపడి ప్రమాదకరంగా మారుతున్నాయని, వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శ్యామలనగర్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన భవనాన్ని పరిశీలించి, పట్టణ ప్రణాళిక సచివాలయ కార్యదర్శులు భవన నిర్మాణ సమయంలోనే నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ మేరకు నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. పర్యటనలో ఈఈలు విష్ణు, కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులను ప్రోత్సహిస్తున్న మోదీ

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల పై జరుగుతున్న దాడులకు పరోక్షంగా ప్రధాని మోదీ సహకరిస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. దేశ వ్యాప్తంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ అధికారం చేపట్టిన తరువాత వారిపై దాడులు గణనీయంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద పార్టీలు అని చెప్పుకునే జనసేన, టీడీపీలు మోదీ అడుగు జాడల్లోనే పయనిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి అధ్యక్షత వహించగా, నిరసనల్లో చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్, పుప్పాల సత్యనారాయణ, ముప్పాళ్ళ శివశంకరరావు, రామిశెట్టి ఆదేశ్వరరావు, రెంటాల కుమారి, జంగాల చైతన్య, వలి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసనల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

క్రీడల్లో ప్రతిభ చూపిన టీజేపీఎస్ విద్యార్థులు

గుంటూరు (విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపులో విద్యనభ్యసి స్తున్న బి.రోచిష్మతి వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటినట్లు కళాశాల కార్యదర్శి కె.వి.బ్రహ్మం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి మహిళా వెయిట్ లిఫ్టింగ్ 77 కిలోల కేటగిరిలో సబ్ జూనియర్‌లో గోల్డ్ మెడల్, జూనియర్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన అండర్ 17 బాలుర విభాగం వెయిట్ లిఫ్టింగ్‌లో ఎస్కే అకియర్ అహమ్మద్ మొదటి స్థానం సాధించి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. డిసెంబరు రెండో వారం లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రోచిష్మతి, అదేవిధంగా మధ్యప్రదేశ్‌లో వచ్చే నెల చివరి వారంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అకియర్ అహమ్మద్ ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వర శాస్త్రి తదితరులు అభినందించారు.

గాయకురాలు సుశీలకు భారతరత్న ప్రకటించాలి

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని పి.సుశీలకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని పలువురు గాయనీ, గాయ కులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాల యంలో మంగళవారం గాయని పి.సుశీల 90వ జన్మదిన దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి 'ది లెజెండ్' సుశీల అని ప్రశంసించారు. గాయని వి రాజేశ్వరిదేవి మాట్లాడుతూ దక్షిణ భారత ప్లే బ్యాక్ రంగంలో అగ్రగామి గాయకురాలైన పి సుశీల 12 భాషల్లో వేలాది పాటలు పాడిన గాన సరస్వతి అన్నారు. కళాసౌధ అధ్యక్షుడు, గాయకుడు అశోక్ మాట్లా డుతూ ఆమె పాడిన పాటలు తెలుగు భాష ఉన్నంత కాలం తెలుగు వారి గుండెల్లో నిలిచిపోతాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పింగళి భాగ్యలక్ష్మి, మల్లేశ్వరరావు, పిఎల్ఎన్ మూర్తి తదితరులున్నారు.

గుంటూరు ఐఎంఏ శాఖకు నాలుగు అవార్డులు

గుంటూరు మెడికల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ పలు విభాగాల్లో విశేష సేవలు అందిం చిన సంస్థాగత శాఖలకు ప్రదానం చేసే వార్షిక అవార్డుల్లో గుంటూరు ఐఎం ఏ శాఖకు నాలుగు అవార్డులు దక్కినట్లు ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ టీ.సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు, వైద్యులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు ఐఎంఏ గుం టూరు శాఖ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు కార్య నిర్వాహక వర్గానికి బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్ అవార్డు, ఉత్తమ శాఖ కార్య దర్శి అవార్డు డాక్టర్ బీ.సాయికృష్ణకు లభించినట్లు ఆయన తెలిపారు. ఇటీ వల గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన జ్వరాల నేపథ్యంలో స్థానికంగా గ్రామంలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు ఉత్తమ సేవా అవార్డు గుంటూరు శాఖకు ప్రకటించారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ టీ సేవకుమార్‌కు బెస్ట్ ఔట్‌స్టాండింగ్ ఆఫీస్ బేరర్ అవార్డు లభించినట్లు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగే ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ఈ అవార్డులను అందజేస్తారని డాక్టర్ సేవకుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ నందకిషోర్, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నాగళ్ల కిషోర్, ఐఎంఏ సీజీపీ డైరెక్టర్ డాక్టర్ ఎం.పర్నీకుమార్ తదితరులు సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఆశా వర్కర్లకు డీఎంహెచ్‌వో అభినందనలు

గుంటూరు మెడికల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువ ఆపద మిత్ర పథకం కింద జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, ఒడిస్సా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో అక్టోబరు 13వ తేదీ నుంచి నవంబరు 7 వరకు జరిగిన టీవోటీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న జిల్లాకు చెందిన ఆశా వర్కర్లు యు.అనిత, కే.సంధ్య, జే.మల్లీశ్వరిలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి అభినందించారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖకు చెందిన 52 మంది క్షేత్రస్థాయి సిబ్బందిని ఎంపిక చేసి ఈ కార్యక్రమంలో వారికి శిక్షణ ఇచ్చారు. ముగ్గురు ఆశా వర్కర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా డీఎంహెచ్‌వోను కలిసి శిక్షణ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికి తీయడమే క్విజ్ పోటీల లక్ష్యం

గుంటూరు (విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట లోని జిల్లా గ్రంథాలయ సంస్థలో మంగళవారం పాఠశాల స్థాయి విద్యార్థి నీ, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలను నిర్వ హించినట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలి పారు. కార్యదర్శి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ఉపయోగపడతాయ న్నారు. కార్యక్రమంలో ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు గుర్రం మురళీమోహన్, ఉపగ్రంథ పాలకురాలు కందుల ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో కార్యదర్శి సుబ్బరత్నమ్మ తదితరులు

అవినీతి వ్యతిరేక కవితల పోటీ

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు, ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా అవినీతి వ్యతి రేక కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతిని వ్యతిరేకించే ఏ అం శం మీదనైనా కవులు ఐదు పద్యాలు, ఒక గేయం, అయిదు మినీ కవితలు, ఒక వచన కవిత పంపించవచ్చన్నారు. ఏ కవిత అయినా 24 పదాలకు మించకుండా రాయాలన్నారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అని అన్నారు. కవి తలను 9493686165 వాట్సప్ నంబరుకు ఈనెల 30లోగా పంపాలన్నారు.

ఝాన్సీ లక్ష్మి భాయి ఆశయ స్ఫూర్తితో ముందడుగు వేయాలి

● బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరి

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణా లర్పించిన ఝాన్సీ లక్ష్మి బాయి ఆశయ స్ఫూర్తితో మహిళలు, నేటి బాలికలు ముందడుగు వేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఝాన్సీ లక్ష్మి బాయి జయంతి పురస్కరించుకుని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఝాన్సీ లక్ష్మి బాయి ధీరత్వం, ఆమె చూపిన తెగువను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ పోటీల ద్వారా బాలికల్లో వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈదర శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ రాయుడు, మల్లేశ్వరరావు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ

వైభవంగా గౌరీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించి, అనంతరం ఉండవల్లి శ్రీనివాసరావు, రాజరాజేశ్వరి దంపతులచే అర్చకస్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ, చక్రపాణిలు పర్యవేక్షించారు.



మాదక ద్రవ్యాలు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి తదితరులు

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారమే

● జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి

గుంటూరు(విద్య),నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : యువత మత్తు, మాదక ద్రవ్యాలు బారీన పడరాదని జిల్లా ఉపాధి కల్పన అధికారి, దివ్యాంగుల శాఖ ఇన్‌చార్జ్ సహాయ సంచాలకులు డి.దుర్గా బాయి పిలుపునిచ్చారు. "నషా ముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం జేకేసీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ నినదించారు. దుర్గాబాయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫోన్ చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్ చికిలే ఇషాన్‌కు ప్రశంసలు

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 16న జరిగిన ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నగరానికి చెందిన చికిలే ఇషాన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-8 బాలుర విభాగంలో 50 మీటర్ల బటర్‌ఫ్లై ప్రథమ స్థానం, 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుని సత్తా చాటాడు. ఈ సందర్భంగా అద్భుత ప్రదర్శన చూపిన చికిలే ఇషాన్, ఆయన కోచ్ గాలి వెంకటేశ్వరరావు, క్రీడాకారుని తల్లిదండ్రులను గుంటూరు క్లబ్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్, కోశాధికారి భూపేన్ మోమయ, సభ్యుడు సూర్యదేవర తిరుమల దేవ్ ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికను అందజేశారు.

షట్కాల శివలింగార్చనతో మోక్షం

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): షట్కాల శివలింగా ర్చనతో మోక్షం సిద్ధిస్తుందని డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కార్తిక మాసం సందర్భంగా షట్కాల శివలింగా ర్చనపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, తూనుగుంట్ల రాధాబాయి, వెలువోలు నాగరాజ్యలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ తూనుగుంట్ల నాధాబాయి భారతీయ దృక్పథంలో పర్యావరణం అనే అంశంపై ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర జ్యోతిర్లింగ అర్చన

గుంటూరు(తూర్పు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్ లోని శ్రీ సాయినాథ సన్నిధానంలో కార్తిక మాసశివరాత్రి సందర్భంగా సహస్ర జ్యోతిర్లింగ అర్చన శ్రద్ధాసక్తులతో వైభవంగా నిర్వహించారు. వందలాది మహిళా భక్తులు కార్యక్రమంలో పాల్గొని దీప అలంకరణ చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు యడ్లపాటి అశోక్ కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య తదితరులు కార్యక్రమ నిర్వహణ చేశారు.

● స్థానిక మారుతినగర్‌లో శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో మాస శివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, సహస్ర మృత్తిక లింగార్చన అభిషేకం, శ్రీ గంగా గౌరీ సమేత గౌరీ శంకర్ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

కన్నుల పండువగా బాబా వారి రథోత్సవం

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి శత వర్ష జన్మ దినోత్సవం పురస్కరించుకుని నగరంలో నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో సత్య సాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎల్ నరసింహారావు, సత్య సాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు సత్యనారాయణ, మహంకాళి శ్రీనివాస్, లీలావతి, కిశోర్, నాగేంద్రబాబు, సీతామహాలక్ష్మీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా శ్రీనివాసులు



గొట్టిపాటి శ్రీనివాసులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖకు అత్యంత కీలకమైన స్పెషల్ బ్రాంచ్ విభాగం డీఎస్పీగా గొట్టిపాటి శ్రీనివాసులు నియమితు లయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలసి మొక్కను అందించారు. 1995లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరిన శ్రీనివాసులు గుంటూరు రేంజ్ పరిధిలోని పలు జిల్లాల్లో ఎస్సైగా, సీఐగా బాధ్యతలు నిర్వహించి డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన అనంతరం గుంటూరు జిల్లా పోలీస్ విభాగానికి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు. గతంలో ఎస్బీ డీఎస్పీగా సీతారామయ్య విధులు నిర్వహించారు. సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించిన కేసులో అరెస్టయి పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పై వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దాడికి యత్నించిన ఘటన నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడింది. అప్పటి నుంచి ఎస్బీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. కాగా, ఎస్బీ-1 సీఐగా ఆళహరి శ్రీనివాస్, ఎస్బీ-2 సీఐగా రాంబాబు ఉన్నారు.

యువకుడికి ఏడు నెలల జైలు శిక్ష

● ప్రేమ పేరుతో యువతిని వేధించిన కేసులో తీర్పు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని వేధింపులకు గురి చేసిన కేసులో యువకుడికి కోర్టు ఏడు నెలల జైలు శిక్షను విధించింది. పాత గుంటూరులో నివాసం ఉంటున్న ఒక యువతిని అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ జుబేర్ అహ్మద్ (25) అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. ఆమె కాలేజీకి వెళ్లే సందర్భాలలో తరచూ వెంబడించి అడ్డుకోవడం ప్రేమ పేరుతో వేధించడం చేసేవాడు. కుటుంబసభ్యులు మందలించినా వేధింపులు కొనసాగించాడు. అలాగే తన ప్రేమను అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు. దీనిపై 2019 డిసెంబరు 24న బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి జుబేర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి 7 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 3 వేలు జరిమానా విధించింది.



దివ్యాంగ మహిళ దగ్గరకు వెళ్లి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మహిళా సమస్యల పరిష్కార చిరునామాగా ఉంటా

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని మహిళల సమస్యల పరిష్కారానికి చిరునామాగా నిలుస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆమె వినతులు స్వీకరించారు. పెన్షన్, పోలీస్ స్టేషన్ సంబంధిత సమస్యలు, హాస్పిటల్ ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, స్థానిక అభివృద్ధి వంటి అనేక విభాగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను విని, వాటికి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా తమ సమస్యలను భయపడి కాకుండా ధైర్యంగా చెప్పుకునే వేదిక పశ్చిమ కార్యాలయం ఉంటుందని చెప్పారు. దీని వల్ల మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. మహిళల కళ్లల్లో సంతోషం చూడడమే తమ లక్ష్యమని, అలాగే నియోజకవర్గంలోని మహిళా నాయకులు ప్రజల్లో తిరిగి సమస్యలను గుర్తించి, వాటిని తన దృష్టికి తీసుకురావడంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేత ఆళ్ల హరి పాల్గొన్నారు.

డీసీసీబీ ఇన్‌ఛార్జ్ సీఈవోగా ఫణికుమార్

● బోర్డు సమావేశంలో చైర్మన్ మక్కెన నిర్ణయం

● అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఇన్‌ఛార్జ్ సీఈవోగా వీవీఎస్ ఫణికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకారభవన్‌లో మంగళవారం జరిగిన బ్యాంకు బోర్డు సమావేశంలో చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం బ్యాంకు ఇన్‌ఛార్జ్ సీఈవోగా అజయ్‌కిషోర్ వ్యవహరిస్తుండగా తాజాగా మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఇన్‌ఛార్జ్‌గా ఫణికుమార్ నియమితులయ్యారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో సీఈవోగా కృష్ణవేణి వ్యవహరించారు. ఆమె హయాంలో బ్యాంకులో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయా ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే విచారణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చైర్మన్ మక్కెన ఇటీవల ప్రకటించారు. త్వరలోనే విచారణ పూర్తి చేసి నివేదికలు కూడా వస్తాయని, క్రిమినల్ కేసులు నమోదు చేసి దోషులను వదిలేది లేదని స్పష్టం చేశారు. ఆయా అక్రమాల నేపథ్యంలోనే తాజాగా ఇన్‌ఛార్జ్ సీఈవోగా అజయ్‌కిషోర్‌ను తప్పించి ఫణికుమార్‌ను నియమించినట్లు తెలిసింది.

నాబార్డు అధికారుల తనిఖీలు...

బ్యాంకులో జరిగిన లావాదేవీలతో పాటు అక్రమాలపై ఇప్పటికే నాబార్డు అధికారులు దృష్టి పెట్టారు. మూడు వారాలుగా ఉమ్మడి జిల్లాలోని బ్యాంకు శాఖల్లో పూర్తి స్థాయిలో విచారణ జరిపినట్లు సమాచారం. విచారణ జరిపిన అధికారులు వివిధ అంశాలపై చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో చర్చించినట్లు తెలిసింది. కాగా బ్యాంకు శాఖల్లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాలపై త్వరలోనే బాధ్యులైన అధికారులపై సస్పెన్షన్‌లతో పాటు దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇన్ఫోసిస్ ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థినుల ఎంపిక

గుంటూరు (విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫో సిస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు సత్తా చాటారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన 41 మంది విద్యార్థినులు రూ.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఇందులో సీఎస్‌బీఎస్ విభాగం నుంచి ఒకరు, డేటా సైన్స్ నుంచి 8 మంది, ఏఐ అండ్ ఎంఎల్ నుంచి 7 మంది, ఐటీ విభాగం నుంచి ఒకరు, సీఎస్ఈ నుంచి 16 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుంచి ఒకరు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి 6 మంది, ఎంసీఏ విభాగం నుంచి ఒకరు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయ వాడ లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ పోటీలలో శ్రీ పాటిబండ్ల సీతారామ య్య హైస్కూల్ విద్యార్థి 9వ తరగతి చదువుతున్న మొహమ్మద్ 100 మీటర్లు పరుగు పోటీలలో పాల్గొని పసిడి పతకాన్ని, 8వ తరగతి చదువుతున్న షణ్ముఖ్ 800 మీటర్ల పరుగు పోటీలలో పాల్గొని పసిడి పతకాన్ని సాధించాడు. 400 మీటర్లు రిలే పరుగు పోటీలలో 9వ తరగతి చదువుతున్న మొహమ్మద్, భార్గవ్, సాహిర్, 8వ తరగతి చదువుతున్న షణ్ముఖ్ పాల్గొని పసిడి పతకాలను సాధించారు. మాజీ ఎంపీ, పాఠశాల కమిటీ గౌరవ అధ్యక్షుడు యలమంచిలి శివాజీ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంతో వాటిని పరిష్కరించుకొనే సామర్థ్యం ఆటలలో వారు సాధించే గెలుపు-ఓటము ల ద్వారా పెంపొందుతుందని తెలిపారు. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెం ట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటల లో కూడా ప్రతిభ చూపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధామాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్ ఇన్‌చార్జి కొమ్మినేని హరిప్రియ పాల్గొన్నారు.

రైల్వే కోర్టు జిల్లా కోర్టు ఆవరణకు తరలింపు

గుంటూరు (లీగల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరండల్ పేట ఒకటో లైన్‌లో రిజర్వేషన్ కౌంటర్ పక్కన పని చేస్తున్న రైల్వే మేజిస్ట్రేట్ కోర్టును జిల్లా కోర్టు ఆవరణకు తరలించారు. నేటి నుంచి రైల్వే మేజిస్ట్రేట్ కోర్టు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఎదురుగా గల జిల్లా కోర్టు భవనంలోని రెండవ అంతస్తులో పని చేయనున్నది. రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూల్చివేయడంతో న్యాయవాదులు ఆ కోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని అధిగమించేందుకు రైల్వే మేజిస్ట్రేట్ కోర్టును జిల్లా కోర్టు ఆవరణలోనికి తరలించాలని బార్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు శివసూర్య నారాయణ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తికి లేఖ రాశారు. దీంతో జిల్లా జడ్జి రైల్వే అధికారులకు, హై కోర్టుకు లేఖలు పంపి వారిని ఒప్పించటంతో కోర్టు తరలింపు సులువైంది.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాసం, మాసశివరాత్రి సందర్భంగా సోమవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేదపండితుల నిర్వహణలో చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు మంగళవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 230 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 927 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 103 క్యూసెక్కులనీరు పశ్చిమకాల్వకు 26 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 122 క్యూసెక్కులనీరు, కొమ్మమూరు కాల్వకు 2560 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాలయార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 223 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.12,400, గరిష్టధర రూ.13,000, మోడల్‌ధర రూ.12,400 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.12,625, గరిష్టధర రూ.12,625, మోడల్‌ధర రూ.12,625 పలికాయి.

సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

తాడేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24 తేదీల్లో తాడేపల్లిలో జరిగే సీఐటియూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సీఐటియూ మండల కన్వీనర్ పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో పారిశుధ్య కార్మికులను కలిసి తాడేపల్లిలో జరిగే మహాసభల జయప్రదానికై తరలి రావాలని కోరారు. కార్మిక హక్కుల కోసం సీఐటీయూ అనేక పోరాటాలు చేసిందన్నారు. తాడేపల్లిలో జరిగే జిల్లా మహాసభల్లో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, అంకమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాసశివరాత్రి



అన్నపర్రు బొడ్డాయి సెంటర్లో దీపారాధన చేస్తున్న భక్తులు

పెదనందిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో కార్తీక మాసశివరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా దేవస్థానాల వద్ద వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కోటి, లక్ష దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సోమేశ్వరస్వామి, వరగాని బొడ్యాయి సెంటర్లో విశేష పూజలు చేసి గ్రామస్థులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆటోడ్రైవర్ల హామీని నెరవేర్చాలి

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజి ప్రభుత్వాన్ని కోరారు. బస్టాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని ఆదాయవనరుగా చూస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ అయిల్ ధరలు తగ్గినా పెట్రోలు, డీజిల్‌పై విపరీతమైన టాక్స్‌లు వేస్తున్నారన్నారు. అంతేగాకుండా ఆటోలకు పార్కింగ్ ప్రదేశాలు కూడా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యూనియన్ నాయకులు కుమార్, మహేంద్ర, మార్క్, శివ, మంజునాధ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పద్య, వ్యాసరచన పోటీలు

మంగళగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరి మండలం నూతక్కి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు శంకర్, టీచర్లు మస్తాన్, జేమ్స్‌వాణి పోటీలను పర్యవేక్షించారు. గ్రంథాలయాధికారి పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్: శాఖా గ్రంథాలయం తాడేపల్లిలో సీనియర్స్ విభాగంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై ఉదయం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా జ్యోతి, సునీత, హాజరయ్యారు.

● దుగ్గిరాల : స్థానిక శాఖాగ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి బీజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక జడ్పీ హైస్కూల్ బాలబాలికలు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఫిరంగిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనుగుపాడులో మంగళవారం డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి హాస్పటల్ సహకారంతో పొనుగుపాడు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెండు వందల మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఆత్మకూరులో నేత్ర వైద్య శిబిరం

మంగళగిరి సిటీ : వీజే డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సేవాపథకం ప్రత్యేక క్యాంపులో నాలుగో రోజు మంగళవారం ఆత్మకూరు గ్రామంలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. అష్టమాలజిస్టు గోలి పుష్పాకర్ నేతృత్వంలోని వైద్య బృందం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

● అడ్డుగోలుగా వైసీపీ నాయకుల దందా
● గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు
● లచ్చన్నగుడిపూడిలో ఉద్రిక్తత



గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్లకు కార్లు అడ్డు పెట్టిన గ్రామస్థులు



లచ్చన్నగుడిపూడిలో రాత్రి సమయంలో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు

తాడికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో వైసీపీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలకు తెరలేపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనుమతులు తీసుకున్న నిర్వాహకులు లీజు గడువు ముగియటంతో తవ్వకాలను నిలిపివేశారు. తాడికొండ మండలంలో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, అలాగే రాజధానిలో అభివృద్ధి పనులకు గ్రావెల్ అవసరముండటంతో కన్నుగిట్టిన వైసీపీ నేతలు ఆదివారం రాత్రి నుంచి గ్రావెల్ తవ్వకాలను తిరిగి ప్రారంభించారు. నాలుగు ఎక్స్‌కవేటర్లతో భారీగా తవ్వకాలు జరిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రావెల్‌ను తరలించే టిప్పర్లు బయటకు వెళ్లకుండా కార్లను అడ్డుపెట్టి అధికారులకు సమాచారం అందించారు. అయితే ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు మైనింగ్ జరిగే ప్రాంతానికి వచ్చి మమ అనిపించి వెళ్లారు. గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారుల వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు. రెవెన్యూ అధికారులు కూడా గ్రావెల్ తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు.

పత్తిని వెనక్కి పంపొద్దు

● ప్రతి క్వింటాల్ కొనేలా ఆదేశాలు జారీ చేయండి
● సీసీఐ మేనేజర్‌తో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



సీసీఐ మేనేజర్ రాజేంద్రషాతో సమావేశమైన ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ప్రత్తిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మిల్లులకు వచ్చిన పత్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి పంపొద్దని, నిబంధనలు పక్కన పెట్టి కొనుగోళ్లు చేసేలా బయ్యర్లుకు ఆదేశాలివ్వాలని సీసీఐ మేనేజర్ రాజేంద్ర షాను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు. గుంటూరు సీసీఐ కార్యాలయంలో మేనేజర్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు ధరకు చాలా వ్యత్యాసం ఉంటుందని రాజేంద్రషా దృష్టికి తీసుకువచ్చారు. వరుస వర్షాలతో పత్తిలో తేమశాతం బాగా పెరిగిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని గతంలో ఉన్న 8 శాతాన్ని 18కి పెంచి కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. అనంతరం వట్టిచెరుకూరు మండలం, కోయవారిపాలెంలోని సీసీఐ మిల్లును ఎమ్మెల్యే పరిశీలించారు. బయ్యర్లతో మాట్లాడి సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కోయవారిపాలెం వద్ద శివసాయి టీఎంటీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చిన పత్తిని వెనక్కు తీసుకెళ్లకుండా ఇక్కడే ఆరబెట్టుకోవడంతో పాటు గ్రేడ్ చేసుకునే అవకాశం రైతులకు ఇవ్వాలని మార్కెట్ యార్డు అధికారులను ఆదేశించారు. సీసీఐ అధికారులు తిరస్కరిస్తున్న పత్తిని మార్కెట్ యార్డు ద్వారా కొనుగోలు చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని మార్కెట్ యార్డు డైరెక్టర్ పమిడి శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి శివరామప్రసాద్, కాసు పెంటారెడ్డి, కుర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు మండలాల్లో 87 మందికి రూ.64 లక్షల 87 వేల విలువ కల్గిన చెక్కులను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా జ్యోతిర్లింగార్చన



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు



వట్టిచెరుకూరులో జ్యోతిలింగార్చన, కర్పూర జ్యోతి పూజల్లో పాల్గొన్న మహిళలు

వట్టిచెరుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని శ్రీగంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జ్యోతిర్లింగార్చన, కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పారిశ్రామికవేత్త ముప్పా భాస్కరరావు, ఆయన సతీమణి జయశ్రీ కార్తిక మాసం సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామ మహిళలు జ్యోతిర్లింగార్చన, కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అఖండ కర్పూర జ్యోతి

పెదనందిపాడు : మండల పరిధిలోని గోగులమూడిలోని సిద్ధి గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవాకం 24వ వార్షిక అఖండ కర్పూర జ్యోతి కార్యక్రమం కనుల పండువగా జరిగింది. దేవస్థానం ఎదుట 51కేజీల కర్పూరాన్ని ఏర్పాటు చేసి భక్తులు, కమిటీ సభ్యులు భజనా కార్యక్రమాల నడుమ జ్యోతి వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

● కాకుమాను: మండలపరిధిలోని కొమ్మూరులో మంగళవారం రాత్రి కోటి దిపోత్సవ కార్యక్రమం నయానందకరంగా జరిగింది. మండలంలో పురాణ ప్రసిద్ధి గాంచిన గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున స్వామి వారికి పంచామృతాలు, మంత్ర జలాలతో అభిషేకాలు జరిగాయి. రాత్రి వేళలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేశారు.

ప్రజలు గొడవలు, అల్లర్లకు పాల్పడరాదు : డీఎస్పీ భానోదయ

పెదనందిపాడు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చిన్న చిన్న విషయాల్లో గొడవలు, అల్లర్లకు పాల్పడరాదని డీఎస్పీ భానోదయ అన్నారు. మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామస్థులకు నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసులతో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించుకోవాలని, శాంతియుతంగా జీవిస్తూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోరాదని తెలిపారు. అల్లర్లకు పాల్పడి కేసులు నమోదైతే వారితో పాటు వారి కుటుంబం కూడా ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. పోలీసుశాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, గ్రామాల్లో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలి

● ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య

పెదనందిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య అన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 20న జరిగే వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేయనున్నట్లు అధికారి శివనాగేశ్వరరావు తెలిపారు.

● తాడేపల్లి: నేటి బాలలే నేటి పౌరులని, నవసమాజ నిర్మాతలు చిన్నారులేనని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఎండివో మేనేజర్ నాగపూర్ నుంచి వచ్చిన సంజయ్ బరాయ్ అన్నారు. మంగళవారం తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్లో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలల హక్కులు చాలా ముఖ్యమైనవని, జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు, స్వేచ్ఛ హక్కులు ఉన్నాయని చెప్పారు. పెనుమాక హైస్కూల్లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కారుమంచి రామారావు, గుడ్ షెపర్డ్ సిబ్బంది కె అనూష, అత్తోట పోతురాజు, పి.అనిల్ కుమార్, ఎస్ నాగమణి, ఎం మోహనరావు, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం : ఫిరంగిపురం లోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జానపద పాటల పోటీలను విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుర్గారెడ్డి, ఫ్రాన్సిస్ మాస్టారు తదితర పెద్దలు పాల్గొన్నారు.

టిడ్కోలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును స్థానిక నేతలు మంగళవారం లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేశారు. టిడ్కోకు చెందిన చావలి ప్రీతి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ.26,702లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, కొండా జనార్ధన్, జంజనం సాంబశివరావు, ఇండ్ల రజని, చెన్నపట్నం సత్య, అబ్దుల్ షబీనా బేగం, గంజి శివసుధ, దివి జయశ్రీ, దండే శ్రీలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాధిక

మంగళగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన ఏపీ 39వ సబ్‌జూనియర్స్, కాడేట్, సీనియర్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మంగళగిరికి చెందిన అమరావతి తైక్వాండో అకాడమీ క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. బాలికల విభాగంలో పీ.రాధిక బంగారు పతకం, టీ.దేవయాని కాంస్యం, బాలుర విభాగంలో ఎం.హనీష్ విజయసాయి, జీ.సాయి ఈశ్వర్ కార్తికేయ రజత, పీ.ప్రణీత్ కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన రాధిక పంజాబ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీ.సుబ్బారావు తెలిపారు. పతకాలు సాధించిన చిన్నారులను కోచ్ దుర్గాప్రసాద్, పలువురు ప్రముఖులు అభినందించారు.

కల్కి భూ ఆక్రమణలపై విచారణ చేయాలి



పీసీసీఎఫ్ చలపతిరావుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకట సుబ్బయ్య

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిక మండలం వరదయ్యపాలెంలో కల్కి ట్రస్టు ఆక్రమించిన 21 ఎకరాల అంజూర్ అటవీ భూములపై విచారణ జరిపించాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మంగళగిరిలోని అరణ్య భవన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పీవీ చలపతిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీ నిబంధనలకు విరుద్ధంగా ఆశ్రమానికి విదేశీయులను రప్పించి, చుట్టుపక్కల వృక్ష సంపదను, జంతువులను నాశనం చేస్తున్నారని తెలిపారు. 21 ఎకరాల అటవీ భూమిని ఎవరో తమకు విక్రయించారని దొంగ పత్రాలను సృష్టించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి అంజూర్ అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి కార్యదర్శి కౌతరపు ప్రసాద్, జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

చిర్రావూరులో పొలం పిలుస్తోంది

తాడేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ సౌజన్యంతో రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే మొక్కజొన్న, జొన్న పంటలు పండించే విధానంలో సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి సూచనలు రైతులకు ఆర్ఏ ఆర్ఎస్ లాం ఫారం ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీలతా వాణి వివరించారు. ఏవో పి.శిరీష మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఖరీఫ్ సీజన్ 2025 -26 పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు అమ్మదలిచిన రైతులు వరి కోయడానికి ముందుగా రైతు సేవా కేంద్రాల వద్ద వివరాలను రిజిష్టరు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాసననేని శ్రీనివాసరావు, రాజువంశీ, రమేష్‌బాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య తపోవన్‌లో స్వామి కళ్యాణమహోత్సవాలు



ప్రసంగిస్తున్న మాతా శివానంద సరస్వతి



కళ్యాణ మహోత్సవ శోభలో స్వామి

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకుని చైతన్య తపోవన్‌లో శ్రీశివ సుందరేశ్వర స్వామికి, శ్రీరాధాకృష్ణలకు కళ్యాణ మహోత్సవాలు చైతన్య తపోవన్ వ్యవస్థాపకులు మాతా శివచైతన్యానంద సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6గంటలకు నిర్వహించారు. మాతాజీ మాట్లాడుతూ ప్రకృతి పురుషుల ఐక్యతకు చిహ్నం దేవీ దేవతల కల్యాణాలు, ఆదిదంపతులు శివపార్వతుల అర్ధనారీశ్వరతత్వం, రాధాకృష్ణల ప్రేమైక తత్వం, యావత్ సమాజానికి ఆదర్శమన్నారు. మాతా శివానంద సరస్వతి, 108 మంది దంపతులు భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై విశేష పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ శ్రేష్టి, నోరి కోదండరామ్, యలమంచిలి లక్ష్మణ ప్రసాద్ దంపతులు, కె విద్యాధరరావు దంపతులు, గాదంశెట్టి సుజాత, విజయ, ప్రసాద్, సురేష్, తదితరలు పాల్గొన్నారు.

పంటల సాగులో సమగ్రసస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి

పెదనందిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి అన్నారు. మండల పరిధిలోని రావిపాడు, జీజీపాలెం గ్రామాల్లో ఆత్మ వారి సౌజన్యంతో మంగళవారం రైతులకు పొలంబడి, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న, మిరప, శెనగ పైర్లు నాటే ముందు తెగుళ్లు, పురుగు నివారణకు విత్తన శుద్ధి చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించిందని దీని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల వరద

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల వరదలు మొదలయ్యాయని విశాఖలో నిర్వహించిన సీఐఐ సమ్మిట్ ద్వారా సీఎం చంద్రబాబు నిరూపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చాయని తెలిపారు. చంద్రబాబు బ్రాండ్‌తో నాడు హైదరాబాద్, నేడు అమరావతికి పరిశ్రమల ఏర్పాటుకు దూసుకుపోతుంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారని ఆయన గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వివిధ దేశాలు పర్యటించి ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి తెచ్చారని తెలిపారు. విశాఖ సమ్మిట్లో 13.86 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయని, అమరావ తి ప్రాంతానికి క్వాంటమ్ వ్యాలీ తెస్తున్నారని అన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని ఆయన న్నారు.

పాఠశాలలకు రూ.33 లక్షల విలువైన సామగ్రి



కలెక్టర్ అన్సారియాకు సంబంధిత పత్రాలు అందజేస్తున్న టయోటా ప్రతినిధులు

మంగళగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలంలోని 13 పాఠశాలలకు టయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ సీఎస్ఆర్ కింద రూ.33 లక్షల విలువైన సామగ్రిని అందజేసింది. ఫర్నిచర్, క్రీడా పరికరాలు, వంట సామగ్రి, బెంచీలు, కుర్చీలు, డెస్కులు, పోడియంలు, అల్మారాలు, వాలీబాల్, షటిల్, క్యారమ్స్ క్రికెట్ కిట్లు, స్టవ్‌లు, కుక్కర్లు తదితర వస్తువులను అందజేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సంబంధిత పత్రాలను అందజేశారు. సీఎస్ఆర్ నిధులను వెచ్చించి సేవా కార్యక్రమాలను నిర్వహించడంపై కలెక్టర్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ఏపీ హెడ్ బి.నిఖిల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబీకులకు ఆర్థికసాయం



అగ్నిబాధిత కుటుంబీకులకు నగదు, నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న తాళ్ల అశోక్, గోగం నాగేశ్వరరావు తదితరులు

దుగ్గిరాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం మోరంపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధిత కుటుంబీకులకు కూటమి నాయకుల చేతుల మీదుగా నగదుసాయం అందించారు. గ్రామానికి చెందిన శృంగారపాటి లక్ష్మి, ఇంట్లో మీటర్‌వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి, ఇల్లు పూర్తిగా కాలిబూడిదైన విషయం విదితమే. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ స్పందించి సాయమందించాలని ఆదేశాలు జారీ చేయడంతో రూ.20వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ తాళ్ల అశోక్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గోగం నాగేశ్వరరావు, షైలా చిన్నా, దానబోయిన సుబ్బారావు, గోళ్ల పున్నారావు, కరేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంఆర్ఐ సింపోజియంలో ఎన్నారై విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న చినకాకాని ఎన్నారై విద్యార్థిని

మంగళగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతి అపోలో క్లినిక్‌లో మంగళవారం సింపోజియం ఆన్ ఎంఆర్ఐ జరిగింది. ప్రపంచ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ సంబంధిత ఆధునిక అంశాలపై చర్చించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్ సెషన్‌లో మంగళగిరి ఎన్నారై అలైడ్ అండ్ హెల్త్ కేర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఆర్ఐ బ్రెస్ట్, ఎంఆర్ఐ ఆర్టిఫ్యాక్ట్స్ అంశాలను అత్యుత్తంగా ప్రదర్శించి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఎన్నారై రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంకమ్మరావు అభినందించారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: డాక్టర్ జాస్తి

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, మాంసాహారం కోసం మూగజీవాలను చంపవద్దని డాక్టర్ జాస్తి వెంకటసుబ్బారావు చెప్పారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ అధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మహాకారుణ్య శాకాహార ర్యాలీ చేశారు. నేటి ఉరుకులు, పరుగుల జీవనం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ధ్యానంపై ధ్యాసపెడితే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రామలింగేశ్వరపేటలోని ధ్యాన మందిరంలో ప్రతి గురువారం ధ్యానం, సత్సంగాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. చుండూరు నాగ మల్లికార్జునరావు, వేణు, రాంబాబు, రామారావు, భానుమతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పీడీకే రావుకు భారత జ్యోతి పురస్కారం

● నేడు అందజేయనున్న వెంకయ్య నాయుడు

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సమాజ సేవకుడు పీడీకే రావుకు గురువారం భారత జ్యోతి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ప్రదానోత్సవానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం, తెనాలి ప్రచురణలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో పీడీకే రావు పరిచయ సంచికను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరిస్తారు. డాక్యుమెంటరీ వీడియోను శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ విడుదల చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు.


దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

రూ.4లక్షల నిత్యావసరాలు పంపిణీ

పొన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో రిలైబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.4లక్షలు విలువ గలిగిన నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని నిడుబ్రోలు శాంథోం కరుణా నిలయంలో ఆశ్రయం పొందుతున్న 200మంది మానసిక దివ్యాంగులకు మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు, రగ్గులు, దుప్పట్లు, ఫ్యాన్లు, గీజర్, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిలైబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవిని శాంథోం కరుణా నిలయం నిర్వాహకులు జాక్ క్లమాకస్, ఆర్ఐ రామారావు, తదితరులు ప్రత్యేకంగా సత్కరించారు.

వివాహిత ఆకస్మిక మృతి

తెనాలి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుల్తానాబాద్‌లో వివాహిత స్నానానికి బాత్రూమ్‌కు వెళ్లి ఆకస్మికంగా మృతి చెందింది. ఎస్ఐ కరిముల్లా తెలిపిన వివరాల ప్రకారం, స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కూలీగా పనిచేస్తున్న షాజహాన్ భార్య షేక్ హసీనా సోమవారం రాత్రి 9 గంటల సమయంలో స్నానం చేసేందుకు బాత్రూమ్‌లోకి వెళ్లి ఆకస్మికంగా కుప్పకూలి మృతిచెందింది. వీరికి ఇద్దరు సంతానం. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినుము నూర్పిడి మిషన్‌లో పడి మహిళ మృతి

కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మినుము నూర్పిడి మిషన్‌లోపడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురం లంక గ్రామంలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం గ్రామానికి చెందిన షేక్ ఖాసింబీ (40) కూలీ పనుల నిమిత్తం కొల్లిపర మండలం వల్లభాపురం లంక గ్రామానికి వచ్చింది. ఖాసింబీ మినుము ఓదెలను నూర్పిడి యంత్రంలో వేస్తుండగా చీర ఇరుక్కొని మిషన్‌లోకి ఆమె పడిపోయింది. దాంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలి

● శివసాంబిరెడ్డి

కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాసభల కరపత్రాలను సీఐటీయూ నాయకులు, ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ, డిసెంబరు 31వ తేదీ నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖ పట్నంలో ఐదు రోజుల పాటు మహాసభలు జరుగుతాయని తెలియజేశారు. ఈ మహాసభలలో వివిధ రాష్ట్రాల్లో కార్మిక హక్కుల కోసం పోరాడిన నాయకులు, విదేశీ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా యావత్ కార్మికవర్గాన్ని ఐక్యంచేయటం సీఐటీయూ ఆశయమని కార్మిక కర్షక ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి, సీఐటీయూ నాయకులు ఏ.పూర్ణారెడ్డి, బొంతు లక్ష్మారెడ్డి, ఆరిమండ శ్రీనివాసరెడ్డి, సహకార సంఘ ఉద్యోగులు అవుతు స్వాతి, గనిపిశెట్టి విజయభాస్కర్, గంపల వెంకట్రావు, యర్రు కోటేశ్వరరావు, వల్లభాపురం గౌతమి తదితరులు పాల్గొన్నారు.


మారీసుపేటలో శివునికి చేసిన అన్నాభిషేకం

ముక్కంటికి అన్నాభిషేకం

వైభవంగా మాస శివరాత్రి పూజలు

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ముక్కంటికి అన్నాభిషేకంతో పాటు మాస శివరాత్రి పూజలు మంగళవారం ప్రత్యేకంగా నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో శ్రీవింధ్యవాసిని సహిత నగరేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని తిలకించారు. భక్తులు సమర్పించిన బియ్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ పాలనా వ్యవహారాల ఇన్‌చార్జి మునగాల మోహన శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మారీసుపేటలోని కోదండ రామస్వామి ఆలయంలో 365 నర్మద బాణ లింగాలకు అన్నాభిషేకం చేశారు. ధర్మకర్త శివానందకుమార్, నారాయణస్వామి, ఆంజనేయ ప్రసాద్, అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు. రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం గావించారు. సాలిగ్రామ మఠం ట్రస్టు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో అన్నకూట మహోత్సవం నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. శివానందలహరి పారాయణ, శివ సంకీర్తనలు ఆలపించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, ముద్దాభక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, జయలక్ష్మి, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో రామేశ్వరస్వామికి వేకువజాము నుంచే అభిషేకాలు చేసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం దీపాలతో వెలుగొందింది.

అగస్త్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పొన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్ళపల్లిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక మాస శివరాత్రి సందర్భంగా ప్రతేక పూజలు జరిపారు. వేకువజామున అగస్త్యేశ్వర స్వామి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చందన లేపనం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని బాలా త్రిపుర సుందరీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో కర్పూరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగింది. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



మారీసుపేటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మారీసుపేటలో ఘనంగా కల్యాణం

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని శివాలయంలో మంగళవారం సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీబాలత్రిపురసుందరి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చనలు, స్వామివారికి లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన, హారతులు ఘనంగా జరిపారు. స్వామివారి కల్యాణంలో కమిటీ అధ్యక్షుడు గ్రంధి మాధవరావు, కార్యదర్శి పొన్నూరు శశి, వరద శేషగిరిరావు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి పురస్కరించుకుని అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రదోషకాలంలో అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చనల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అర్చకులు రాఘవేంద్ర శివప్రసాద్, ఈవో హరిప్రసాద్ పర్యవేక్షించారు.


సాలి గ్రామ మఠం ట్రస్టులో మాస శివరాత్రి పూజలు చేస్తున్న బాలస్వామి

విజ్ఞానం కోసం పుస్తక పఠనం అవసరం

● కమిషనర్ అప్పలనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విజ్ఞానం వికసించాలంటే పుస్తక పఠనం ఎంతగానో అవసరమని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు అన్నారు. కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళా సాధికారత కార్యాలయాన్ని నిర్వహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు గ్రంథాలను చదివితే మంచి ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదపడుతుందని చెప్పారు. సాయి లక్కరాజు, బాలచంద్రమౌళి, కడియాల సుజాత, బెల్లంకొండ వెంకట్, శ్రీదేవి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు వక్తృత్వ పోటీలు, పద్యాల పోటీలు నిర్వహించారు. అయినాల మల్లేశ్వరరావు, భీమేశ్వరప్రసాద్, సాంబశివరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ లావణ్య సుధ పర్యవేక్షించారు.

● కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ప్రధానోపాధ్యాయుడు రవికిషోర్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం శాఖా గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికిషోర్‌బాబు మాట్లాడుతూ, బాల్యం నుంచి విద్యార్థులు మెదడుకు పదును పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీషు, హిందీ నేర్చుకోవడం వల్ల ఉన్నత స్థాయికి ఎదగటానికి అవకాశం ఉందన్నారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను వెలికి తీయవచ్చన్నారు. అదేవిధంగా తూములూరు, కొల్లిపర, మున్నంగి శాఖా గ్రంథాలయాల్లో ఆటలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు సాంబశివనాయక్, జ్యోతి, సత్యమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● చేబ్రోలు: చేబ్రోలు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లైబ్రరీ పరిచయం, పుస్తకాల ఉపయోగం, పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న కమ్ టు ది లైబ్రరీ-ఎవ్రీ సండే కార్యక్రమానికి విద్యార్థులు హాజరై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ వి.పరమేశ్వరి సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రతిరోజు విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా అబ్బారెడ్డి వెంకటేశ్వరరావు వారికి బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఉర్దూ నడింపేట విద్యార్థులు, ప్రధానోపాధ్యాయిరాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈరే మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఈరే మినిస్ట్రీస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని బిషప్ భానుప్రసాద్ పేర్కొన్నారు. ప్యాడిసన్‌పేటలో చైర్మన్ కత్తెర సుధీర్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుధీర్‌కుమార్‌ను పాస్టర్లు గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కత్తెర సంతోషి, గిద్యోను, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఆనందబాబు, కార్పొరేషన్ చైర్మన్ సదాశివాన్ని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. తెనాలి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ, నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించినట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రపాటి సదాశివం మాట్లాడుతూ, 31 ఏళ్లుగా ఐక్యమత్యంగా కార్తిక సమారాధన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంఘం ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. డీఎస్పీ రవీంద్రబాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు రఘురామయ్య, శివశేషగిరిరావు, రవి, శివలింగప్రసాద్, సంఘ అధ్యక్షుడు చందర్లపాటి సూర్యవెంకటేష్, సుబ్రహ్మణ్యం, రాజారమేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు

క్రమశిక్షణ లోపిస్తే జీవితంలో రాణించలేరు

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే జీవితంలో రాణించలేరని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎం హైస్కూల్‌లో మంగళవారం దస్తూరి పోటీలు నిర్వహించారు. పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలను తహసీల్దార్ ప్రదానం చేశారు. చదువుతో పాటు చేతిరాత కూడా బాగుండాలని వేగంగా రాయడం కూడా అలవాటు చేసుకుంటే పోటీ పరీక్షలను సునాయాసంగా ఎదుర్కోగల శక్తి లభిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు క్షణికావేశాలకు లోనవుతున్నారని, సెల్‌ఫోన్‌తో కాలం గడుపుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని చెప్పారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను ప్రయోజకులుగా చేయాలని కలలు కంటుంటే కొంతమంది విద్యార్థులు వారి నమ్మకాలను వమ్ముచేయడం సరికాదని చెప్పారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, జయంత్‌బాబు, సోమశంకర్, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


ఐటీటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పెదకాకాని ఎస్ఐ మీరాజ్

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● పెదకాకాని ఎస్ఐ మీరాజ్

పెదకాకాని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పెదకాకాని ఎస్ఐ షేక్ మీరాజ్ అన్నారు. మంగళవారం తక్కెళ్లపాడులోని ఐటీఐ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెదకాకాని పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మీరాజ్ మాట్లాడుతూ, పూర్తి అవగాహనతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చన్నారు. గంజాయి, కొకైన్, ఇతర ప్రమాదకరమైన డ్రగ్స్‌ను చుట్టుపక్కల ఎవరు విక్రయించినా లేదా వాడుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీసులకు లేదా 1972కు సమాచారం అందించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలని, కోరారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రైల్వే ఎస్పీ జి.రత్నరాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మచిలీపట్నం-ధర్మవరం రైలులో తమ సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదులు అందాయి. రైల్వే డీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పడి విచారణ చేపట్టారు. గుడివాడలోని సీసీ కెమెరాల పరిశీలన ద్వారా వచ్చిన సమాచారం మేరకు తెనాలికి చెందిన షేక్ కరీముల్లా, అనంతపురం జిల్లా, డోన్‌కు చెందిన ఆంథోని చిన్నప్పను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.6లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కరీముల్లా ధర్మవరం రైలులో బెడ్ రోలర్‌గా పనిచేస్తున్నాడు.

నారాకోడూరులో విద్యార్థులకు పళ్లేల పంపిణీ

చేబ్రోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం నారాకోడూరులోని ఎంపీపీఎస్ (ఏబీ) పాఠశాలను మంగళవారం ఎంఈవో-2 ఆర్.సుబ్బారావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రిజిస్టర్లు, అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ల హ్యాండ్ బుక్‌లను పరిశీలించి సూచనలు చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.కల్యాణి (ఎస్‌జీటీ) విద్యార్థులకు 60 భోజన పళ్లేలను ఎంఈవో సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాలలో ప్లేట్లు కొరతగా ఉండటంతో వాటిని తన సొంత ఖర్చులతో అందజేసిన ఎస్.కల్యాణికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శంకర్, ఎం.ఉమా, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



భోజన ప్లేట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు


మిల్లర్లతో సమావేశమైన తహసీల్దార్ జియావుల్ హక్

ధాన్యం సేకరణకు సమాయత్తం కావాలి

● తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలో ధాన్యం సేకరణకు సంబంధించి మిల్లర్లు సమాయత్తం కావాలని తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ధాన్యం సేకరణపై 13 మంది రైస్ మిల్లర్లతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. గోనె సంచులు, మాయిశ్చర్ మీటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ధాన్యం చెల్లింపులకు సంబంధించి బ్యాంకు గ్యారంటీలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు ధాన్యం సేకరణ చేయాలని తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సౌకర్యాలను అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్లు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలి

● మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి


కొల్లిపర మండలం చివలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో నూర్పిళ్లు ప్రారంభించే రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చివలూరులో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నూర్పిళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలియజేశారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రబీలో రెండో పంటగా మొక్కజొన్న, జొన్నసాగు చేసే రైతులు లైసెన్సు కలిగిన షాపుల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు: ధాన్యం అమ్మకాల కోసం రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు చెప్పారు. మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పైరు పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. హార్వెస్టర్ ద్వారా కోసిన ధాన్యం ఎండబెట్టి 17శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలని సూచించారు. దళారులకు అమ్మి నష్టపోకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి పంట విక్రయించుకోవాలని సూచించారు. రబీలో మొక్కజొన్న పైరులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రెండో విడత నగదు బుధవారం రైతు ఖాతాలకు జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు పూజ, కె.పవన్, ఎంపీడీవో సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణకు గురైన స్థలాన్ని ఇప్పించండి'

కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో రజకులకు చెందిన చెందిన స్థలాన్ని కొంత మంది వ్యక్తులు అక్రమించుకొని నివసిస్తున్నారని, అక్రమణలు తొలగించి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఇప్పించాలని తహసీల్దార్ సిద్ధార్థకు రజక సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ రజక సంఘం నాయకులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. స్థలం వివరాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తనున్నట్లు వారికి తెలియజేశారు.


కాలనీ వాసులతో గణేష్ యూత్ కన్వీనర్ మురళి

విద్యుత్ సౌకర్యానికి గణేష్ యూత్ సాయం

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గణేష్ యూత్ ఆధ్వర్యంలో 28వ వార్డులోని కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. కాలనీవాసులు వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన కన్వీనర్ వీరవల్లి మురళి తన మిత్రబృందంతో కలిసి 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి వీధి దీపాలు వెలిగించారు. మంగళవారం యూత్ మిత్ర బృందానికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కనగాల నాగభూషణం, కన్నెగంటి భాస్కరరావు, నాగేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కొల్లిపరలో సహకార సంఘం జెండా ఎగురవేసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఘనంగా సహకార సంఘ వారోత్సవాలు

కొల్లిపర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సహకార సంఘం సీనియర్ ఇన్‌స్పెక్టర్లు భావన్నారాయణరాజు, పి.ప్రసాద్, బ్రాంచి మేనేజర్ బాజీబాబా, సూపర్‌వైజర్ ప్రవీణ్, సీఈవోలు గుదిబండి శివనాగిరెడ్డి, ఎ.పూర్ణారెడ్డి, విజయభాస్కర్, వెంకట్రావు హాజరై జెండాను అవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కొల్లిపర సహకార సంఘం బ్రాంచి మేనేజర్ బాజీబాబా మాట్లాడుతూ, కొల్లిపర బ్రాంచి పరిధిలో ఇప్పటివరకు రైతులకు రూ.102కోట్ల రుణాలను ఇచ్చామని చెప్పారు. అదేవిధంగా ఈ ఖరీఫ్‌లో రైతులకు రూ. 7కోట్ల 61లక్షల రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు, లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.